

బుధవారం తెలంగాణ భవన్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్. చిత్రంలో శాసనమండలి పక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్‌అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తుల ఉమ, భాస్కర్‌రావు, దేవీప్రసాద్, గెల్లు శ్రీనివాస్. కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ దీవకొండ దామోదర్‌రావు. కేటీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారులు.

తెలంగాణభవన్‌లో న్యూఇయర్ వేడుకలు

పార్టీశ్రేణులతో కలిసి కేక్ కట్‌చేసిన కేటీఆర్ • సర్కార్‌పై అలుపెరగని పోరు చేద్దామని పిలుపు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణభవన్‌లో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేక్ కట్‌చేశారు. నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. అసమర్థ కాంగ్రెస్ సర్కారు పాలనపై అలుపెరుగని పోరాటం చేద్దామని, అందుకు పార్టీ నేతలు, శ్రేణులు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చే ఏకైక లక్ష్యంతో పార్టీ శ్రేణులంతా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా, నలమోతు భాస్కర్‌రావు, బాల్క సుమన్, చెరుకు సుధాకర్, రాకేశ్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, దేవీప్రసాద్, తుల ఉమ, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, రావుల శ్రీధర్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్, రంగినేని అభిలాశ్, చిరుమళ్ల రాకేశ్, వై సతీశ్‌రెడ్డి, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌లో 12000 కోట్ల స్కాం!

> నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నది. రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టేస్తున్నరు. ఫామ్‌హౌస్ అన్నరు! డ్రగ్స్ కేసు అన్నరు! ఫోన్ ట్యాపింగ్ అన్నరు! లగచర్ల అన్నరు! ఇంకేదో అన్నరు.. ఇప్పుడు ఈ-కార్ రేసు అంటున్నరు! నాపై ఇది ఆరో ప్రయత్నం. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు. అందుకే నాపై కేసులు పెడుతున్నరు. రేవంత్‌రెడ్డికే కాదు.. ఆయన తాతముత్తాతలకు కూడా భయపడేదిలేదు. -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

దాడులు చేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది పాలనలోనే రూ.1.38 లక్షల కోట్లు అప్పు చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఢిల్లీకి కప్పం కింద ఎంత చెల్లించిందని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు బడా కాంట్రాక్టర్ల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి ఢిల్లీకి డబ్బులు పంపిస్తున్నారని విమర్శించారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ తనను తప్పుడు కేసులో ఇరికించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆరుసార్లు ప్రయత్నించారని, ఇప్పుడు ఈ కార్ రేస్ అని మరో ప్రయత్నం చేశారని చెప్పారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో పైసా అవినీతి జరగలేదని.. ఇదో లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానించారు.

అవినీతే లేదు.. కేసు ఎక్కడిది?

సీఎం రేవంత్‌రెడ్డి ఈ రేసును రద్దు చేయడం వల్ల రాష్ట్రానికి రూ.600 కోట్ల నష్టం జరిగిందని కేటీఆర్ విమర్శించారు. 'ఏసీబీ కేసులో అస్సలు పస లేదు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు. పైసా అవినీతి లేదు. అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడిది? ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు. ఈ కేసు నిలవదు కాబట్టి ఈడీ కేసు కూడా ఉండదు. జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదు. రేసు కావాలని నేను నిర్ణయం తీసుకున్న.. వద్దనేది రేవంత్ నిర్ణయం. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదు. నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్‌రెడ్డి.. ఒక ముఖ్యమంత్రి అని పెట్టడం లేదా? నాకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉన్నది. ఫార్ములా ఈ కేసులో హైకోర్టులో ఏం తీర్పు వస్తుందో చూద్దాం. 7న ఈడీ విచారణకు హాజరుపై మా లాయర్లు నిర్ణయిస్తారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పులతడకగా ఉన్నదని, సంబంధంలేని అన్ని అంశాలను అందులో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరికించారని విమర్శించారు. కెమెరాల ముందు డబ్బుతో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని నిప్పులుచెరిగారు. 'నేను ఏ తప్పూ చేయలేదు కాబట్టే ధైర్యంగా మాట్లాడుతున్న.. వాస్తవాలు ప్రజలు చూస్తున్నరు' అని స్పష్టంచేశారు.

రైతులకు సెల్ఫ్‌డిక్లరేషన్ ఎందుకు?

రైతు భరోసాలో కోత పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో ఎక్కడా లేని విధంగా పంట పొలాల సాగు అంశంలో సెల్ఫ్ డిక్లరేషన్ అంశాన్ని రైతులపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 14.50 లక్షల కోట్ల అప్పును బ్యాంకులు రైటాఫ్ చేసినప్పుడు లేని సెల్ఫ్ డిక్లరేషన్ రైతుల విషయానికి వచ్చేసరికి ఎందుకని నిలదీశారు. బ్యాంకులను ముంచేటోళ్లకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదుకాని, అందరికీ అన్నం పెట్టే రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు? అని ప్రశ్నించారు. రైతు భరోసాను ప్రభుత్వం నామమాత్రంగా అమలుచేయాలని చూస్తున్నదని, ఉద్యోగులు, పాన్‌కార్డ్ ఉన్నవాళ్లకు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. రైతు భరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతున్నదని చెప్పారు.

బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లా నేతలు లోలం శ్యాంసుందర్, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో బీజేపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మహేశ్‌రెడ్డి తదితరులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

> దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకొనే పనిలో కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలున్నరు. ఒక్కో మంత్రి ఒక్కో అవినీతి దుకాణం తెరిచిండ్రు. ఉప ముఖ్యమంత్రి నుంచి మొదలుకొని కోమటిరెడ్డి దాకా ప్రతి ఒక్కరూ డబ్బులు సంపాదించే పనిలో పడ్డరు. మంత్రులు ఎంతదోచుకుంటున్నరో అధికారులను అడిగితే తెలుస్తుంది. -కేటీఆర్

సుప్రీంకోర్టుతో తిట్లుపడ్డ ఏకైక సీఎం

కాంగ్రెస్ సర్కార్‌కు పేదలు కనిపించడం లేదని, కేవలం పెద్దల కోసమే పనిచేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. సుప్రీంకోర్టు నుంచి తిట్లు పడ్డ ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎద్దేవాచేశారు. చివరికి కోర్టుకు క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. ఖాజాగూడలో పేదల ఆస్తులపై కాంగ్రెస్ నాయకులు కన్నేశారని నాలుగు ఎకరాల భూములు గుంజుకొని పేదలను అక్కడి నుంచి వెళ్లగొట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారడం, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టుకు వెళ్తామని చెప్పారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చి, ఈ సంవత్సరం ఉప ఎన్నికలు రావచ్చని, వస్తాయనే నమ్మకం తనకు ఉన్నదని తెలిపారు.

> ఖాజాగూడలో కూడా పేదల ఆస్తులపై కాంగ్రెస్ నాయకులు కన్నేశారు. పెద్దలకు ఇచ్చేందుకు అక్కడ నాలుగు ఎకరాల భూములను గుంజుకొని పేదలను తరిమేశారు. ఇండ్లను బలవంతంగా కూలగొట్టారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? హైకోర్టు, సుప్రీంకోర్టు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా రేవంత్‌రెడ్డి సర్కారుకు బుద్ధి రావడం లేదు. -కేటీఆర్

కాంగ్రెస్ పాలనకు మైనస్ మార్కులే

కాంగ్రెస్ ఏడాది పాలనకు ప్రజల నుంచి, తమ పార్టీ నుంచి ఇచ్చేది మైనస్ మార్కులేనని కేటీఆర్ దెప్పిపొడిచారు. 'తెలంగాణ ప్రజలు ఒక్కరు కూడా ఈ ప్రభుత్వం బాగున్నదని చెప్తున్నరా? ఒక్కరైనా ఈ సీఎం గురించి మంచిగ మాట్లాడుతున్నరా? సమాజంలో ఎవరిని తట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఘోరంగా తిడుతున్నారు' అని ఎద్దేవాచేశారు. 'ఎన్నికల సమయంలో అప్పు చేయకపోవడమే మేము చేయబోయే అభివృద్ధి అన్న రేవంత్, ఇప్పుడు ఏడాదిలోనే రూ.1.38 లక్షల కోట్ల అప్పు ఎందుకు చేశారో చెప్పాలి. ఢిల్లీ కాంగ్రెస్‌కు ఎంత డబ్బు పోతున్నదో వెల్లడించాలి. ఆర్ఆర్ ట్యాక్స్ రూపంలో ఢిల్లీ పెద్దలకు ముడుపులు ఎంతెంత వెళ్తున్నాయో చెప్పాలి' అని నిలదీశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిపై నిర్ణయం తీసుకోలే

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిపై నిర్ణయం తీసుకోలేదని, పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ తరపున అభ్యర్థులను పెట్టి ఉద్యమ సమయంలో తామే కొత్త సంప్రదాయం తెచ్చామని కేటీఆర్ చెప్పారు. 'ప్రతిపక్ష పార్టీ పాత్రను మేము చాలా స్పష్టంగా నిర్వహిస్తున్నం. మేము ప్రభుత్వ అన్యాయాలను, అక్రమాలను ఎదిరిస్తున్నం. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చేవరకు ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటం' అని తేల్చిచెప్పారు. ఈ ఏడాది మొదటి హాఫ్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఎప్పుడు, ఎక్కడ జరుపాలనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సైతం ఉంటుందని పేర్కొన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామని వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు అక్టోబర్ దాకా సమయమున్నదని తెలిపారు. 60 లక్షల భారత రాష్ట్ర సమితి కార్యకర్తల అభీష్టం మేరకు మరోసారి పార్టీ అధినేత కేసీఆర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకుంటామని, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

42 శాతం రిజర్వేషన్లు ఎగొట్టే కుట్ర

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆలోచన రేవంత్‌రెడ్డి సర్కారుకు లేదని చెప్పారు. అందుకే ప్రణాళికబద్ధంగా కుట్రకు తెరలేపిందని విమర్శించారు. కుట్రలో భాగంగానే శాసనసభలో చేసిన స్థానిక సంస్థల చట్ట సవరణలో బీసీలకు మరింత రిజర్వేషన్లు కల్పించేందుకు సుప్రీంకోర్టు కేసు ప్రస్తావన, ఆర్ఆర్ఆర్ టెస్ట్, ప్రత్యేక బీసీ కమిషన్ సిఫార్సులు నివేదిక వంటి కారణాలను ప్రస్తావించిందని వెల్లడించారు. ఇవన్నీ అడ్డుపెట్టుకొని ఎవరిరో ఒకరితో కేసు వేయించి స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.

చంద్రయ్య (ఫైల్)

భాగ్యమ్మ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

జగిత్యాల జిల్లాలో విషాదం

ధర్మపురి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా చర్చిలో ప్రార్థనలు చేసి బైక్‌పై ఇంటికి వస్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురిలో చోటుచేసుకున్నది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం రామయ్యపల్లికి చెందిన కూస చంద్రయ్య (60), కూస భాగ్యమ్మ (55) దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి ధర్మపురిలోని ఓ చర్చికి వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. తిరిగి అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు 2.30 గంటల సమయంలో మోపెడ్‌పై ఇంటికి వెళ్తుండగా, పట్టణ శివారులోని లక్ష్మీనరసింహకాలనీ వద్ద ఎదురుగా జగిత్యాల వైపు వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందగా, భాగ్యమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం జగిత్యాల దవాఖానకు తరలించగా, బుధవారం వేకువజామున మృతి చెందింది.

బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి

కౌశిక్‌హరినాథ్ (ఫైల్)

పాలకుర్తి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్నేహితుడి బైక్‌పై వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జడీనగర్‌లో జరిగింది. ఈసాల తక్కళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నెరువట్ల తిరుపతి రెండో కుమారుడు నెరువట్ల కౌశిక్‌హరినాథ్ (15) బసంత్‌నగర్ ఐఎంఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. బుధవారం తెల్లవారుజామున స్నేహితుడి బైక్‌పై బసంత్‌నగర్ నుంచి టోల్‌గేట్ వైపు వస్తుండగా, జీడీనగర్ బస్టాండ్ సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. కౌశిక్‌హరినాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108లో పెద్దపల్లికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

నూలు అందక.. నడవని సాంచాలు

- మూత పడుతున్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమ
- రోడ్డున పడ్డ వందలాది మంది నేతన్నలు
- వేములవాడ నూలు బ్యాంకులో నిల్వలు నిల్
- సర్కార్ చెప్పిన మాటలు నీటి మూటలు
- డీడీలు కట్టి నెలవుతున్నా తప్పని పడిగాపులు

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు బ్యాంకు

రాజన్న సిరిసిల్ల, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : వస్త్ర పరిశ్రమకు చేయూతనిస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు మాటలు నీటి మూటలే అయ్యాయి. సబ్సిడీపై నూలు అందిస్తామని ఎన్నో గొప్పలు చెప్పి వేములవాడలో ఏర్పాటు చేసిన యారన్ బ్యాంకులో నూలు నిల్వలు మృగ్యమయ్యాయి. దీంతో నూలు అందక వస్త్రపరిశ్రమ మూతపడే దశకుచేరి వందలాది మంది కార్మికులు రోడ్డున పడే దుస్థితి వచ్చింది. డీడీలు కట్టి దాదాపు నెల అవుతున్నా నూలు రాక వస్త్ర ఉత్పత్తి నిలిచిపోయి కార్మికుల ఉపాధిపై దెబ్బపడింది. దాదాపు పదివేల మరమగ్గాలు బందయ్యి, వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. సిరిసిల్ల నేతన్నలను ఆదుకునేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కోటి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి వారి బతుకులకు భరోసా కల్పిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను బంద్ చేసి వారి పొట్టకొట్టింది. మెరుగైన ఆర్డర్లు ఇస్తామని చెప్పి 65 లక్షల మీటర్ల ఆర్వీఎం యూనిఫాంల తయారీ ఆర్డర్లు కంటితుడుపుగా ఇచ్చి చేతులు దులుపుకొన్నది.

మూతపడ్డ సాంచాలు..

వస్త్ర ఉత్పత్తులకు వినియోగించే నూలును సబ్సిడీపై అందించి పరిశ్రమకు చేయూత నిస్తామని చెప్పిన ప్రభుత్వం వేములవాడ మార్కెట్ యార్డులో యారన్ బ్యాంకును ప్రారంభించింది. వందకు పది శాతం డబ్బులు చెల్లిస్తే సరిపడా నూలు సరఫరా చేస్తామని ప్రకటించింది. నూలు సరఫరా బాధ్యతను టెస్కోకు అప్పగించింది. సిరిసిల్లలో 128 మాక్స్ సంఘాలున్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 12 మంది ఆసాములున్నారు. ఒక్కో సంఘానికి దాదాపు 150 సాంచాల వరకు ఉండగా, మొత్తం 20,400 సాంచాలకు ప్రభుత్వం 65 లక్షల ఆర్వీఎం యూనిఫాంల తయారీ ఆర్డర్లు ఇచ్చింది. ఒక్కో సంఘానికి 51,100 మీటర్ల వస్త్ర తయారీ ఆర్డర్లను టెస్కో ద్వారా ఇచ్చింది. ఈ ఆర్డర్లకు సుమారు 104 టన్నుల నూలు అవసరం కాగా, యారన్ బ్యాంకు ద్వారా సరఫరా చేయాల్సి ఉన్నది. ఒక్కో మాక్స్ సంఘం నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు నూలు కోసం నెల కిందే డీడీలు చెల్లించారు. నూలు ఏదని ప్రశ్నిస్తే 'రేపు, మాపు' అంటూ అధికారులు దాటవేస్తున్నారని, సాంచాలు బంద్ పడడంతో పూట గడవక ఇబ్బంది పడుతున్నామని ఆసాములు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టన్నుల కొద్దీ నూలు అవసరం ఉన్నా, తక్కువ పరిణామంలో తెప్పించి కొన్ని మాక్స్ సంఘాలకు మాత్రమే సరఫరా చేశారు. 128 సంఘాలుంటే కేవలం 20 సంఘాలకే సరఫరా చేసినట్టు సంఘ సభ్యులు తెలిపారు.

ఒకే మిల్లుకు ఆర్డర్లు

నూలు తెప్పించడంలో అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూలు తయారు చేసే స్పిన్నింగ్ మిల్లులు దేశంలో వందల సంఖ్యలో ఉన్నా ఒకే మిల్లు నుంచి తెప్పించడంలో అంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వస్త్ర పరిశ్రమకు సరిపడా వివిధ మిల్లుల నుంచి యజమానులు గతంలో కొనుగోలు చేసి తెప్పించుకునే వారు. గుజరాత్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి నూలు సిరిసిల్లకు వస్తుండేది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూలు బ్యాంకుకు ఒకే మిల్లుతో ఒప్పందం చేసుకోవడంతో డిమాండ్ మేరకు సరైన సమయంలో సరఫరా కాక, సాంచాలు బంద్ పడుతున్నాయని ఆసాములు, కార్మికులు చెప్తున్నారు.

డీడీలు కట్టి నెలైంది

ఇచ్చిన ఆర్డర్లకు సంబంధించి నూలు కోసం రూ.3 లక్షల డీడీలు కట్టి నెలరోజులైంది. అదిగో ఇదిగో అని అధికారులు చెప్తున్నారే కానీ ఎప్పుడు వస్తుందో చెప్తలేరు. అన్ని రకాల నూలు నిల్వలు అందుబాటులో ఉంటాయని చెప్పి ఇప్పుడు అడిగితే సరైన సమాధానం ఇస్తలేరు. మా సంఘంలో పది మంది ఆసాములున్నారు. నూలు అందక 120 సంచాలు పూర్తిగా మూతపడ్డయి. పనిలేక కార్మికులు పస్తులుంటున్నరు. నూలు బ్యాంకులో నిల్వలు పెంచి వెంటనే సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి. యారన్‌కు ఇచ్చిన సబ్సిడీ వడ్డీలకే సరిపోతున్నది.

- కోడం శంకర్, ఆసామి

టెస్కో స్పందించాలి

కార్మికులకు చేతి నిండా పని కల్పించి, వస్త్ర పరిశ్రమకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం నూలు బ్యాంకు ఏర్పాటు చేసింది. అధికారుల నిర్లక్ష్యంతో సరఫరా కావడం లేదు. డీడీలు కట్టి నెలవుతున్నా నూలు అందక సాంచాలు నడవక, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. టెస్కో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. బ్యాంకులో సరిపడా నూలు అందుబాటులో ఉంచాలి. నెల రోజులవుతున్నా సరఫరా చెయ్యకుంటే ఇచ్చే సబ్సిడీ వడ్డీలకే సరిపోతుంది. ఆసాములు నష్టపోతారు. **- పంతం రవి, చేనేత, వపర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి**

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద సమ్మె చేస్తున్న హమాలీలు

హమాలీ రేట్ల పెంపును అమలు చేయాలి

ఉమ్మడి వరంగల్‌లో కార్మికుల సమ్మె

వరంగల్ నమస్తే నెట్‌వర్క్, జనవరి 1: పెరిగిన సివిల్ సప్లయ్ హమాలీల రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం హమాలీలు, ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘం నాయకులు మాట్లాడుతూ.. సివిల్ సప్లయ్ గోదాంలో దిగుమతి, ఎగుమతి రేట్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని తెలిపారు. కానీ పెరిగిన రేట్లను అమలు చేసేందుకు జీవో జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హమాలీలకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్ రూ.6,500 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విశ్రాంత హమాలీ కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించి, 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని కోరారు.

- ఒంటికాలిపై సీఆర్టీల నిరసన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీలు) చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, హైకోర్టు ఇచ్చిన మినిమం టైం స్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. - భద్రాచలం

బోనులో చిక్కిన పెద్దపులి

చంద్రాపూర్‌కు తరలింపు
ఊపిరి పీల్చుకున్న ఉమ్మడి ఆదిలాబాద్

కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): కొన్ని నెలలుగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) – మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులిని ఎట్టకేలకు మంగళవారం రాత్రి చంద్రాపూర్ అటవీ అధికారులు బోనులో బంధించారు. ఈ పులిని పట్టుకునేందుకు మహారాష్ట్ర అటవీ అధికారులు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నారు. సిర్పూర్(టీ) మండలం – మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామమైన అంతర్గాం అటవీ ప్రాంతంలో మగ పులికి మత్తు మందు ఇచ్చి బోనులో బంధించి ఆపై చంద్రాపూర్‌కు తరలించినట్టు తెలిసింది. పులికి అవసరమైన వైద్యసేవలు అందించిన తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో వదిలివేయనున్నట్టు సమాచారం. దాదాపు రెండు నెలలుగా కౌటాల, సిర్పూర్(టీ) మండలాల్లోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో సంచరిస్తున్న పులి వేటగాళ్ల బారిన పడే ప్రమాదం ఉండటంతో చంద్రాపూర్ అటవీ అధికారులు అప్రమత్తమై పులిని బోనులో బంధించారు. ఈ విషయమై ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. పులులను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తున్నది.

మ్యాన్ ఈటర్‌గా మారిన పులి

సరిహద్దు గ్రామాల్లో ఇద్దరిపై దాడి చేసి ఒకరి ప్రాణాలు తీసి మ్యాన్ ఈటర్‌గా మారిన పులిని ఎట్టకేలకు పట్టుకోవడంతో ఇటు అధికారులు.. అటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత నవంబర్ 29న కాగజ్‌నగర్ మండలం గన్నారం సమీపంలో పత్తి చేనుల్లో పనిచేస్తున్న లక్ష్మిపై దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మరుసటి రోజు సిర్పూర్(టీ) సమీపంలోని పత్తిచేనులో పని చేసుకుంటున్న రైతు సురేశ్‌పై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రెండు నెలల కాలంలో అక్కడక్కడ సంచరిస్తూ తరచూ పశువులపై దాడి చేసింది.

అమిత్‌షా రాజీనామా చేయాలి

సీపీఐ జాతీయ నేత చాడ

చిగురుమామిడి, జనవరి 1 : పార్లమెంటులో బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే తన పదవికి రాజీనామ